# జోరుగా బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం

- కంటోన్మెంట్ పార్టీ అభ్యర్థి లాస్యనందిత గెలుపు కోసం నాయకుల ఇంటింటి ప్రచారం



రెజిమెంటల్‌బజార్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ కోఆప్షన్ సభ్యుడు సీఎన్ నర్సింహ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు



ఎస్ఎన్ కాలనీలో వృద్ధురాలికి బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి

కంటోన్మెంట్/మారేడ్‌పల్లి, నవంబర్ 4 : కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందితకి మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. న్యూ బోయిన్‌పల్లిలోని ఎస్ఎన్ కాలనీ, చిన్నతోకట్టలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కుల మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటింటి ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని, బీఆర్ఎస్‌కే తమ ఓటు అంటూ నినదిస్తున్నారన్నారు. సంక్షేమంలో సీఎం కేసీఆర్ దేశానికే ఆదర్శంగా నిలిచారని, ప్రజలు ఓటు వేసి మద్దతును తెలపాలని కోరారు. ప్రచారంలో రాజు, రాము, చందు, విజయ్, రమేశ్, టింకూ, నర్సింగ్‌రావు, హాసీన్‌ఖాన్, పద్మ, అనిత, అంబిక, భాగ్య, బహ్రూద్దీన్, చిన్న, ముక్తార్ పాల్గొన్నారు.



కంటోన్మెంట్ దుర్గయ్య గార్డెన్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు కిరణ్, నాయకులు

### కారు గుర్తుకే ఓటేద్దాం.. లాస్యనందితని గెలిపిద్దాం..

కారు గుర్తుకే ఓటేద్దాం.. లాస్యనందితని భారీ మెజార్టీతో గెలిపిద్దామంటూ.. రెండో వార్డులోని శివనగర్ బస్తీ, శివాలయం లైన్‌లో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ శుక్రవారం రాత్రి ఇంటింటి ప్రచారం చేశారు. కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందితకు మద్దతుగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ దేవులపల్లి శ్రీనివాస్, పార్టీ వార్డు అధ్యక్షుడు కుమార్ ముదిరాజ్, నర్సింహ, ధన్‌రాజ్, అంజనేయులు, శివయాదవ్, జిలా నీ, ప్రకాశ్, శ్రీను, నాగరాజ్, మల్లేశ్, ఉస్మాన్, స్వామి, రాము, ప్రవీణ్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



శివనగర్ బస్తీలో దుకాణదారుడిని ఓటు అభ్యర్థిస్తున్న మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్

### మారేడ్‌పల్లి పరిధిలో..

కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి జి. లాస్యనందితకు మద్దతుగా శనివారం మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో జీహెచ్ఎంసీ మాజీ కోఆప్షన్ సభ్యుడు సీఎన్. నర్సింహ ముదిరాజ్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గండిమైసమ్మ ఆలయం లైన్, సెవంత్ డే స్కూల్ లైన్, పలు అపార్టుమెంట్లలో తిరుగుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ...కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించిరు. కంటోన్మెంట్‌లో గులాబీ జెండా ఎరగడం ఖాయమని, మెజార్టీయే లక్ష్యంగా పని చేస్తున్నామని మాజీ కోఆప్షన్ సభ్యుడు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అశోక్ ముదిరాజ్, నీలాంకర్, రాంపల్లి గోపి, సతీశ్, రామకృష్ణ, ప్రవీన్, క్రిష్టఫర్, సందీప్, కసిరెడ్డి, సాయి కిరణ్, బాబా, నవీన్, టింకూ, కిరణ్, వెంకటేశ్, అనీల్, నరేశ్,రాజు, భరత్ పాల్గొన్నారు.

### ఐదో వార్డులో...

ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే బీఆర్ఎస్ అభ్యర్థి జి. లాస్యనందితను గెలిపిస్తాయని ఐదవ వార్డు పార్టీ అధ్యక్షుడు కిరణ్ అన్నారు. శనివారం వార్డు పరిధిలోని దుర్గయ్య గార్డెన్ ప్రాంతంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షులు కిరణ్ మాట్లాడుతూ...దివంగత ఎమ్మెల్యే జి. సాయన్న చేసిన అభివృద్ధి పనులే లాస్యనందిత గెలుపునకు దోహదపడుతాయన్నారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, యాదగిరి, అశోక్ పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌లో ఒకే ఒక్క నామినేషన్

కంటోన్మెంట్, నవంబర్ 4 : అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడంతో శనివారం రెండో రోజు కంటోన్మెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఒకే ఒక్క నామినేషన్ దాఖలైంది. శనివారం శ్రమజీవి పార్టీ నుంచి జాజుల భాస్కర్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. ఈ నెల 10 వరకు కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలోని ఆర్వో కేంద్రంలో నామినేషన్లు స్వీకరించనుండగా 13న స్క్రూటినీ చేపట్టి 15న ఉపసంహరణ చేపట్టి అదే రోజు అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. ఈ నెల 8, 9వ తేదీల్లో మంచి రోజులు ఉండటంతో అదే రోజు ఎక్కువ మంది నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తున్నది.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



రుక్మిణి కళాశాల వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి ఈవీ వేణుగోపాల్

మారేడ్‌పల్లి, నవంబర్ 4: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఈవీ వేణుగోపాల్ అన్నారు. శనివారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో రుక్మిణీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ 5వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి ఈవీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకొని కుటుంబం, దేశం గర్వించే స్థాయికి చేరుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో మరింత విజ్ఞానాన్ని పొందాలన్నారు. చంద్రయాన్-3 విజయవంతం కావడంతో మన దేశ సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచ దేశాలకు తెలిసిందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కృష్ణరావు, డైరెక్టర్లు నాగరాజు, వికాస్, ప్రిన్సిపాల్ జ్యోతి పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ప్రచారం



చిన్నతోకట్టలో కారు గుర్తుకే ఓటు వేయాలని యువతను అభ్యర్థిస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి -కంటోన్మెంట్

# నిరుపేదల గుండెల్లో 'డబుల్' ఆనందం

- కంటోన్మెంట్ నియోజకవర్గంలో 1,324 డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న పేదలు
- ఇప్పటి వరకు 970 పూర్తి
- నిర్మాణ దశలో మరో 354 ఇండ్లు

కంటోన్మెంట్, నవంబర్ 4: గూడు లేని నిరుపేదలకు ఇల్లు ఇవ్వడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి అందజేస్తున్నది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో 1,324 ఇండ్లను కేటాయించింది. వీటి నిర్మాణానికి రూ.128 కోట్లు మంజూరు చేసింది. వేగంగా.. నాణ్యతగా పనులు చేపట్టడంతో శరవేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 970 ఇండ్లు పూర్తవగా.. మరో 354 ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. త్వరలో పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయనున్నారు. దీంతో పాటు నగరం చుట్టుపక్కల నిర్మించిన డబుల్ ఇండ్లలో సైతం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కంటోన్మెంట్ వాసుల్లో సుమారు 2,170మందికి ఇండ్లను కేటాయించారు. దాంతో లబ్ధిదారుల గుండెల్లో 'డబుల్' ఆనందం వ్యక్తమవుతున్నది.

### సొంతింటి కల సాకారం..

సొంతింటి కల.. ప్రతి కుటుంబంలో ఒక అద్భుత ఘట్టం. నిరుపేదల కండ్లలో సొంతింటి కల నిజమైనప్పుడు ఆ సంతోషం మాటల్లో చెప్పలేనంతగా ఉంటుంది. అందుకే గూడు లేని పేదల కలలను నిజం చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం చేపట్టింది. కంటోన్మెంట్‌లో అత్యధికంగా 1,324 ఇండ్లను కేటాయించిన ప్రభుత్వం అంతే వేగంగా నిర్మాణ పనులును వేగంగా ముందుకు తీసుకెళ్తున్నది. ఈ ఇండ్లను నిర్మించేందుకు దివంగత ఎమ్మెల్యే సాయన్న, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మారేడ్‌పల్లి, రసూల్‌పురా, మడ్‌ఫోర్డ్ బస్తీల్లో ఇరుకైన సందుల్లో ఇబ్బందులకు గురవుతున్న వారితో మాట్లాడి సర్కారు డబుల్ ఇండ్లను నిర్మించి ఇస్తున్నది. డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంలో కంటోన్మెంట్ నియోజకవర్గం నగరంలోనే మొదటిస్థానంలో నిలిచింది. డబుల్ ఇండ్లు నిర్మించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నది.

### 970 ఇండ్లు పూర్తి..

నియోజకవర్గంలోని మారేడ్‌పల్లిలో 496, రసూల్‌పురా సిల్వర్ కాంపౌండ్‌లో 224, మడ్‌ఫోర్డ్‌లో 306, రసూల్‌పురా నారాయణ జోపుడి సంఘం బస్తీలో 298 డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో మారేడ్‌పల్లిలో 250 ఇండ్లు, సిల్వర్ కాంపౌండ్‌లో 168, మడ్‌ఫోర్డ్‌లో 264 ఇండ్లను ఇది వరకే లబ్ధిదారులకు అందజేశారు. మరికొన్ని ఇండ్లను లబ్ధిదారులకు అందజేయాల్సి ఉండగా, నారాయణ జోపుడి సంఘంలో 298 ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటిని కూడా త్వరలో లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.


### లబ్ధిదారుల్లో పట్టలేని ఆనందం

సొంతింటి కల సాకారమవడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అన్ని సౌకర్యాలతో ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయానికి రోడ్లుకు ఇరువైపులా మొక్కలు నాటారు. నిర్మాణ పనులను దివంగత ఎమ్మెల్యే సాయన్న ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షిస్తూ వచ్చారు. అధికారులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తూ నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూశారు. తాగునీటి సౌకర్యం, సీసీ రోడ్లను నిర్మించారు. ధబూంతో పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కంటోన్మెంట్‌కు చెందిన సుమారు 2,170 మంది లబ్ధిదారులకు సైతం ఇటీవల కాలంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లను సర్కారు అందజేసింది.



మారేడ్‌పల్లిలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయం

### డబుల్ బెడ్‌రూం ఇల్లు రావడం ఎంతో ఆనందాన్నిచ్చింది..



మాది నిరుపేద కుటుంబం.. మేము రోజూ పని చేస్తేనే కానీ ఇల్లు గడిచేదికాదు. కొన్నేండ్ల నుంచి అద్దె ఇంట్లో ఉంటూ ఇబ్బందులు పడుతున్నాం. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మాకు డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయడంతో ఎంతో సంతోషంగా ఉన్నది. సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డి దయతో మాకు సొంతిల్లు దక్కడం ఆనందంగా ఉన్నది.

**– రోహిత్, లబ్దిదారుడు, మారేడ్‌పల్లి**

### అంతా సీఎం కేసీఆర్ పుణ్యం..



సీఎం కేసీఆర్ పుణ్యమా అని మాకు సొంతింటి కల నెరవేరింది. కొన్నేండ్ల నుంచి మేము కిరాయి ఇంట్లో ఉండేవాళ్లం. నెలనెలా అద్దె కట్టలేక ఇబ్బందులు పడ్డాం. మాకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరుచేయడం ఎంతో ఆనందంగా ఉన్నది. బీఆర్ఎస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. మాకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పించిన దివంగత ఎమ్మెల్యే సాయన్నకు మా కుటుంబ సభ్యులందరం రుణపడి ఉంటాం.

**– ముత్యాలు, లబ్ధిదారుడు, మారేడ్‌పల్లి**